క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 125 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆప్తాల్మిక్ అధికారి బాలకిషన్ రావు, వైద్యుడు మారుతి బాబు, ప్రధానోపాధ్యాయుడు యోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి లింగంపల్లి(ఖుర్దు) గ్రామానికి చెందిన జీఎస్‌ఆర్ గార్డెన్, అమృత ఏసీ ఫంక్షన్ హాల్ యజమాని గొల్ల కాశీరాం యాదవ్ మంగళవారం రూ.1 లక్షా 26 వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు దూరిశెట్టి అశోక్ మాట్లాడారు. మంగళవారం బొల్లు లక్ష్మీనారాయణ, లక్ష్మణ్ గౌడ్, వెంకట్‌గౌడ్, బెజుగం దత్తయ్య, గట్టుగారి సంతోష్ కుమార్, ఎదురుగట్ల భీమాగౌడ్, తదితరులు రూ. 11వేల చొప్పున విరాళాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌గౌడ్, మారుతి, బైరయ్య, కొడ రవి, గుండ బాలకిషన్, కొడ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

మాచారెడ్డి: చుక్కాపూర్ మాజీ ఉపసర్పంచ్ నర్సింగరావు రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందారు. దీంతో మంగళవారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులకు రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి ఓదార్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు మినుకూరి రాంరెడ్డి, అంజినాయక్, గోవింద్ రెడ్డి, భాస్కర్ ఉన్నారు.

విద్యార్థుల అభిప్రాయ సేకరణ



బీబీపేట: మండల కేంద్రంలోని టీఎస్‌ఎన్‌ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీని మార్చాలని కోరుతూ సోమవారం విద్యార్థులు ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. దీంతో అధికారులు 15 రోజుల గడువు విధించడంతో మంగళవారం విద్యార్థుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. 15 రోజుల తర్వాత తుది నిర్ణయం తీసుకొని పాత ఏజెన్సీ వారిని ఉంచాలో వద్దో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో అశోక్, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ తదితరులు ఉన్నారు.

మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం




పిట్లం(జుక్కల్): వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పిట్లంకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ నజీర్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో షేక్ నజీర్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు యాదుల్, కార్యదర్శులు అమీర్, ఆంజద్, పెద్దలు కరీం, బాసిద్, హుస్సేన్, మహబూబ్ యూసుఫ్, మజీద్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మేయర్ భర్తపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో దళిత సంఘాల నాయకులు మంగళవారం నోటికి బట్ట కట్టుకుని నిరసన తెలిపారు. నిజామాబాద్ మేయర్ భర్త శేఖర్‌పై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. దళిత సంఘాల నాయకులు రమేష్, పద్మారావు, ప్రభు, కిషన్, సాయిబాబా తదితరులున్నారు.

మొన్న కేజీబీవీ.. నిన్న పాఠశాల..



కేజీబీవీ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు(ఫైల్)



బీబీపేట టీఎస్‌ఎన్‌ఆర్ పాఠశాల విద్యార్థుల ధర్నా(ఫైల్)

- నాసిరకం భోజనమే అసలు సమస్య
- అధికారుల పర్యవేక్షణలోపం
- కమీషన్‌కు కక్కుర్తి పడుతున్న ఏజెన్సీ నిర్వాహకులు
- నిర్వాహకులకు తోడుగా యాజమాన్యాలు, నాయకులు
- అగమ్యగోచరంగా విద్యార్థుల పరిస్థితి

బీబీపేట: మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో విద్యార్థులు భోజనాన్ని తినలేక నానా తంటాలు పడాల్సిన ఏర్పడుతోంది. ఒక్క పాఠశాలలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇదే సమస్య ఎదురవుతోంది. ప్రభుత్వం ప్రతి పాఠశాలకు కావల్సిన సరుకులతో పాటు జీతభత్యాలు సైతం ఇవ్వనుండగా కమీషన్‌కు కక్కుర్తి పడి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకుండా ఏజెన్సీ నిర్వాహకులు కమీషన్‌లు దండుకుంటున్నారు. దీంతో నాణ్యమైన భోజనం అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. మొన్నటికి మొన్న బీబీపేటలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో భోజనం సరిగా వండటం లేదని విద్యార్థులు రాస్తారోకో చేయగా నిన్నటికి నిన్న స్థానిక టీఎస్ఎన్‌ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగ్గా లేదని నడిరోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు.

ఒక్కో విద్యార్థికి అందించాల్సిన పరిమాణం

ప్రతి పాఠశాలలో ప్రతి విద్యార్థికి 150 గ్రాముల చొప్పున బియ్యం, 30 గ్రాముల చొప్పున పప్పు, 7.5 గ్రాముల చొప్పున మంచి నూనె, 7.5 గ్రాముల చొప్పున కూరగాయలు అందించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడే ఏజెన్సీ నిర్వాహకులు చేతివాటం ప్రదర్శిస్తూ కావల్సిన పరిమాణం కన్నా తక్కువగా వంట చేస్తూ విద్యార్థులకు అందజేస్తున్నారు. పరిమాణాలు తక్కువగా వేసి నీళ్ల చారులా వంట చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారు.

కమీషన్ బాటలో ఏజెన్సీ నిర్వాహకులు, అధికారులు

పాఠశాలల్లో హాజరు శాతం 100గా ఉన్నట్లయితే ప్రతి ఒక్కరు తినకపోయినా, తిన్నట్లుగా హెచ్‌ఎంలు హాజరు శాతం వేసి రిజిస్టర్‌లో నమోదు చేయడంతో 100 మందికి డబ్బులు వస్తున్నాయి. అంతే కాకుండా విద్యార్థులకు సరిపడా క్వాంటిటీ సరుకులు కూడా వేయకుండా పది మందికి అయ్యే కూరగాయలు 50 మందికి చేయడంతో దీంట్లో కూడా కమీషన్‌లు తీసుకుంటున్నారు. హాజరు శాతం పెంచి రాయడానికి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు సైతం కమీషన్‌లు ఇస్తున్నామని ఏజెన్సీ నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు.

తరగతులవారీగా డబ్బులు

ఉన్నత పాఠశాల విద్యార్థులకు తరగతులకు ఒక్కో విధంగా ప్రభుత్వం డబ్బులు అందజేస్తుంది. పాఠశాల విద్యార్థుల సంఖ్యను బట్టి ఏజెన్సీ నిర్వాహకులకు సైతం రూ.3 వేల జీతం అందిస్తోంది. అంతే కాకుండా 1 నుంచి 5 వ తరగతి విద్యార్థులకు రూ. 5.45, 6 వ తరగతి నుంచి 8వ తరగతి వరకు రూ.8.17, 9వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.10.67గా అందిస్తున్నారు. అలాగే 1వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు వారానికి మూడు రోజులు కోడిగుడ్లు అందజేస్తున్నారు. వాటికి ఒక్కో విద్యార్థికి రూ.5గా అందజేస్తున్నారు.

పర్యవేక్షణ లోపమే ప్రధాన సమస్య

ప్రతి పాఠశాలలో పాఠశాల యాజమాన్యాలతో చేతులు కలిపి ఎక్కువ మంది హాజరు వేసుకొని కమీషన్ తీసుకుంటున్న నిర్వాహకులపై అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రధాన సమస్యగా మారింది. పట్టించుకోవాల్సిన పాఠశాల యాజమాన్యాలే నిర్వాహకులకు అండగా ఉండడంతో వారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు. అంతే కాకుండా పాడైపోయిన కూరగాయలు, తక్కువ ధరకు వచ్చే వంట నూనెలు తీసుకువచ్చి వంటలు చేయడంతో విద్యార్థుల ఆరోగ్యాలు కూడా దెబ్బతిని ఆస్పత్రుల పాలవుతున్న ఘటనలు కూడా ఉన్నాయి. మండలంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమస్యపై గత పది రోజుల్లోనే రెండు పాఠశాలల్లోని విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేశారు. కానీ ఇప్పటివరకు ఉన్నతాధికారులు ఎవరూ రాకపోవడంతో స్థానిక అధికారులే విద్యార్థులకు నచ్చజెప్పి పంపిస్తున్నారు.

‘ఉద్యోగులు ఐకమత్యంగా ఉండాలి’



టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడితో జిల్లా నేతలు

కామారెడ్డి అర్బన్: ఉద్యోగులందరూ నిబంధనలకు కట్టుబడి ఐకమత్యంగా, సంతోషంగా ఉండాలని టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనీ ఉద్బోధించారని తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ నరాల వెంకట్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో బుధవారం టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామారెడ్డి జిల్లా నేతలతో కలిసి కార్యకలాపాలపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, కేంద్ర సంఘం బాధ్యులు ఎం.నాగరాజు, సహాధ్యక్షుడు ఎం.చక్రధర్, ప్రతినిధులు దేవరాజు, యు.సాయిలు, శ్రావణ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ కోసం గిరిజన రైతులను వేధిస్తున్నారు



రామారెడ్డి: కొడంగల్‌లోని లగచర్లలో ఫార్మాసిటీ కోసం అక్రమంగా భూములను తీసుకుని గిరిజన రైతులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం రామారెడ్డిలో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులు చేసి దాడులు చేసినందుకు బేషరతుగా ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని, అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల జోలికి వస్తే కాంగ్రెస్ పతనం ప్రారంభమవుతుందని హెచ్చరించారు. మాజీ ఎంపీపీ దశరథ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగు రవీందర్ గౌడ్, డైరెక్టర్ నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): రైతులు పంట చేలల్లోని మోటార్లకు కెపాసిటర్లను బిగించుకోవాలని ఎల్లారెడ్డి డీఈ విజయసారథి సూచించారు. మంగళవారం ఆయన బాణాపూర్ శివారులో ఏర్పాటు చేసిన పొలం బాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వంగిన స్తంభాలు, వదులుగా ఉండే తీగలు పంట చేలల్లో ఉంటే లైన్‌మెన్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే రైతులు నేరుగా ట్రాన్స్‌ఫార్మర్‌ల ఫీజులు వేసుకోవద్దన్నారు. లైన్‌మెన్ ద్వారానే కరెంటు పనులు చేయించుకోవాలని సూచించారు. విద్యుత్ వల్ల సమస్యలు ఎదురైతే 1912 నంబరుకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. ఏడీఈ మల్లేశ్, శెట్పల్లిసంగారెడ్డి ఏఈ హరీశ్‌రావు, లైన్‌మెన్ పాల్గొన్నారు.

‘బేగ బుడగ జంగాలుగా గుర్తించాలి’



మాచారెడ్డి తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించిన బేడ బుడగ జంగాల ప్రజలు

మాచారెడ్డి: తమను బేడ బుడగ జంగాలుగా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చుక్కాపూర్ గ్రామానికి చెందిన బేడ బుడగ జంగాల ప్రజలు మాచారెడ్డి తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించారు. వారి వాయిద్య పరికరాలతో తరలి వచ్చిన బుడగ జంగాలు పాటలు పాడుతూ నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో తమను గోసంగి కులంలో చేర్చడం వల్ల ఆ కులస్తులు వ్యతిరేకించారని తెలిపారు. నిజానికి తాము బేడ బుడగ జంగాల కులానికి చెందిన వారిమేనని స్పష్టం చేశారు.అందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. ఇటీవల మాచారెడ్డి తహసీల్దార్ పలు సర్టిఫికెట్లు జారీ చేసిన అనంతరం వాటిని రిజెక్ట్ చేస్తున్నట్లు చెప్పడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. నిజామాబాద్, దోమకొండ, కామారెడ్డి ,బీబీపేట మండలాల్లో సర్టిఫికెట్లు జారీ చేశారని అవి చెలామణి అవుతున్నాయన్నారు. అటు గోసంగి, ఇటు బేడ బుడగ జంగాలు కాకుండా మరి తాము ఏ కులానికి చెందిన వారిమో అధికారులు చెప్పాలని ప్రశ్నించారు. కుల గణనలో భాగంగా తమ కులాన్ని బేడ బుడగ జంగాలుగా నమోదు చేయించుకున్నట్లు వారు స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్వేతకు వినతి పత్రం అందజేశారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళులు





బాన్సువాడలో విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ రామేశ్వర్‌పల్లిలో..

దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశానికి ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



బీబీపేటలో..



దోమకొండలో ..



రాజంపేటలో..



ఎల్లారెడ్డిలో..

అంబులెన్సుల తనిఖీ



బాన్సువాడ రూరల్: మండలకేంద్రంలో మంగళవారం 108, 102, 1962 అత్యవసర సేవల అంబులెన్సులను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈఎంఆర్ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ వాహనాల క్వాలిటీ ఆడిట్ ఆఫీసర్ కిషోర్, జిల్లా ఇంచార్జి తిరుపతి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో అందుబాటులో ఉండే ఔషధాలు, పనిముట్లు, సిబ్బంది రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో 108 సిబ్బంది ప్రసాద్, శ్రీకాంత్ తదితరులున్నారు.

భక్తులు సన్మార్గంలో నడవాలి

ఎల్లారెడ్డిరూరల్: భక్తులు సన్మార్గంలో నడవాలని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. మంగళవారం కిరాణ వర్తక సంఘంలో పాదపూజ, హనుమాన్ చాలీసా కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి శిష్యులు ప్రణయ్, నాగరాజు తదితరులున్నారు.

వైభవంగా పార్థివ లింగార్చన, దీపోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని గోపాల్‌పేట ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి పార్థివ మహాలింగార్చన కార్యక్రమంతో పాటు దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొగిట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామిజీ ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులకు ఆయన ప్రవచనాలు బోధించారు. అనంతరం వేదపండితులు దిగంబరశర్మ ఆధ్వర్యంలో ఆలయం ఆవరణలో దీపాలను వెలిగించారు.

వరి కొయ్యలను కాల్చివేస్తే కాలుష్యం పెరుగుతుంది



భిక్కనూరు: రైతులు వరి కొయ్యలను కాల్చవద్దని కామారెడ్డి వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ అన్నారు. మంగళవారం ఆమె భిక్కనూరు మండల కేంద్రంలో రైతులకు వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూమిలో ఉండే పోషకాలు కూడా దెబ్బతింటాయన్నారు. పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు కూడా నాశనం అవుతాయన్నారు. వరి కొయ్యలను కాల్చకుండా మురుగ బెట్టడం వల్ల రైతులకు మేలు కలుగుతుందన్నారు. ఏవో రాధారెడ్డి, ఏఈవోలు వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ బయోటిక్స్ వాడొద్దు



లింగంపేట(ఎల్లారెడ్డి): యాంటీ బయోటిక్స్ మందులు వాడవద్దని, వాడే వారిని ప్రోత్సహించవద్దని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో వైద్యులు హిమబిందు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యాంటీ బయోటిక్స్ మందుల వాడకం వల్ల ఇతర ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని వివరించారు. అవి ఎక్కువగా వాడడం వల్ల వ్యాధులు వచ్చినప్పుడు ఇతర మందులు పనిచేయవన్నారు.

సర్వే ఆన్‌లైన్ చేయడంపై శిక్షణ



నాగిరెడ్డిపేటలో శిక్షణ ఇస్తున్న అధికారులు



బీబీపేటలో..

సాక్షి నెట్‌వర్క్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్ చేయడంపై మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. సేకరించిన వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలని స్థానిక అధికారులు సూచించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఆన్‌లైన్ పక్రియ ప్రారంభించేందుకు ఆపరేటర్లు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో అధికారులతో పాటు డాటా ఎంట్రీ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



దోమకొండలో ..



రాజంపేటలో హాజరైన ఆపరేటర్లు, జీపీ కార్యదర్శులు

ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని చూడకుండా..

- రోడ్డును బాగు చేసుకునేందుకు కలిసికట్టుగా వచ్చిన గ్రామస్తులు



శ్రమదానం చేసేందుకు వచ్చిన మల్లాపూర్ గ్రామస్తులు


బాన్సువాడ : ఎవరో వస్తారు..ఏదో చేస్తారని చూడకుండా ఊరంతా కలిసి నడుంబిగించారు. బీర్కూర్ మండలం మల్లాపూర్ గ్రామస్తులు స్వయంగా రోడ్డును బాగు చేసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బీర్కూర్ నుంచి మల్లాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో చెట్లు ఏపుగా పెరిగి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తున్నాయి. నిత్యం రోడ్డుపై వెళ్లే వారికి ప్రమాదాలు జరుగుతుండడంతో గ్రామస్తులంతా ఏకమయ్యారు. గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ ఆధ్వర్యంలో మహిళలు, యువకులు అందరూ కలిసి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించారు. రోడ్డుపై ఉన్న మట్టిని ట్రాక్టర్ల సహాయంతో తొలగించారు.

సంక్షిప్తం

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి

కామారెడ్డి అర్బన్: పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం రుచికరంగా ఉండకపోతే చర్యలు తప్పవని కామారెడ్డి ఎంఈవో ఎల్లయ్య హెచ్చరించారు. మంగళవారం నర్సన్నపల్లి, లింగాయపల్లి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం పరిశీలించి ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. భోజనం, కూరల నాణ్యత పెంచాలన్నారు. సీఆర్‌పీ చిరంజీవి ఉన్నారు.

‘గర్భం దాల్చని పశువులకు పరీక్షలు చేయించాలి’



కామారెడ్డి అర్బన్: ఆవులు, గేదెలు సకాలంలో ఎదకు రాకుండా గర్భం దాల్చకపోతే వెంటనే పశువైద్యులను సంప్రదించి గర్భకోశ పరీక్ష, చికిత్సలు చేయించాలని పశువైద్యులు రవికిరణ్, సంజయ్‌కుమార్‌లు అన్నారు. మంగళవారం తిమ్మక్‌పల్లిలో తెలంగాణ పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ నిజామాబాద్, కామారెడ్డిల ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించి 79 పశువులకు చికిత్సలు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులలో మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మున్సిపల్ చైర్మెన్ పద్మ శ్రీకాంత్ పంపిణీ చేశారు. అలాగే పలు గ్రామాలలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత, కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు సాయిబాబాలు చెక్కులను అందించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, తదితరులున్నారు.

బస్సులు నిలపడం లేదని ప్రయాణికుల ఆవేదన

కామారెడ్డి అర్బన్: ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో రద్దీ పెరిగి చేయి ఎత్తిన చోట బస్సులు నిలపడం లేదని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. కామారెడ్డి పట్టణం నుంచి కరీంనగర్ రహదారిలో గతంలో నిజాంసాగర్ చౌరస్తా, ప్రభుత్వ ఆస్పత్రి, పాత బస్టాండ్, రామారెడ్డి రోడ్డు, గంజ్‌గేట్, అయ్యప్పనగర్, కల్లుడిపో, రామేశ్వరపల్లి వద్ద బస్సులను ఆపేవారు. ప్రధానంగా సిద్దిపేట డిపో బస్సులు నిలపకపోవడంతో గంభీరావుపేట, లింగన్నపేట, ముస్తాబాద్, సిద్దిపేట వైపు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందన్నారు.. లేదా కొత్తబస్టాండ్, పాత బస్టాండ్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



కామారెడ్డి అర్బన్: సత్యసాయిబాబా జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక అయ్యప్పనగర్‌లోని సత్యసాయి ఆలయంలో మంగళవారం సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. గాంధీగంజ్ నుంచి ఆలయం వరకు సుప్రభాత నగర సంకీర్తన నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి ప్రసూతి విభాగంలో నవజాత శిశువులకు నూతన వస్త్రాలు, బాలింతలకు పండ్లు, ప్రసాదం, రైల్వే స్టేషన్‌లో నారాయణ సేవ అన్నం ప్యాకెట్లను పంపిణీ చేశారు.